భూ పరిరక్షణే ధ్యేయం..!

గ్రేటర్ హైదరాబాద్ శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్లాలని యోచిస్తోంది. ఈనెల 14న 'యథేచ్ఛగా భూదందా.. సర్కారు భూముల్లో దర్జాగా నిర్మాణాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు భూపరిరక్షణ ధ్యేయంగా చర్యలకు సన్నద్ధమవుతోంది.



- జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూమి 5,195 ఎకరాలు
- జిల్లాలో అసైన్డ్ చేసిన భూములు 11,384 ఎకరాలు
- ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆరాపై రెవెన్యూ శాఖ చర్యలు
- వీఆర్ఓ, వీఏఓలు లేక ప్రభుత్వ భూములపై తప్పిన పట్టు
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై అధికార యంత్రాంగం యోచన

సాక్షి,మేడ్చల్‌జిల్లా: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్ఓ, వీఏఓల వ్యవస్థను గత ప్రభుత్వం సంబంధిత శాఖ నుంచి తప్పించింది. ఆ తర్వాత ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఇబ్బందికరంగా మారింది. గతంలో ప్రతి మండల పరిధిలో వీఆర్ఓ, వీఏఓలు కనీసంగా 100మంది వరకు ఉండేవారు. వారు రెవెన్యూ శాఖ విధుల నిర్వహణలో చేదోడు వాదోడుగా ఉండేవారు. ప్రస్తుతం వీరందరిని ఇతర శాఖల్లోకి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చటం వల్ల రెవెన్యూ శాఖకు ప్రభుత్వ భూముల రక్షణ సమస్యగా తయారైంది.

- దీంతో జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందినా.. మండలం పరిధిలో ఉన్న కొద్దిపాటి రెవెన్యూ ఉద్యోగులు పోలీసుల సహకారంతో చర్యలు తీసుకోవటం.. మినహాయించి ఏమి చేయలేని నిస్సహాయత దాపురించింది. భూరక్షణకు పోలీసుల సహకారం తీసుకుందామన్న వారు ప్రతీరోజు ఏదో అధికారిక కార్యక్రమాల పేరుతో బందోబస్తులో ఉంటున్నామని బదుల్విడంతో సకాలంలో భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోలేకపోతున్నట్లు రెవెన్యూ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ జిల్లా అధికార యంత్రాంగం మాత్రం ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు ప్రత్యేక వ్యూహంతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు వైపు చూస్తోంది.

భూముల గుర్తింపు టాస్క్‌ఫోర్స్‌పై బాధ్యత.!

- జిల్లాలో 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని యంత్రాంగం భావిస్తోంది. భూకబ్జాల్లో రాజకీయ పార్టీ నేతలతో పాటు పలువురి ప్రజాప్రతినిధులు ప్రమేయం ఉండగా... కొందరి ఉద్యోగుల సహకారం కూడా ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం గట్టి నిర్ణయంతో పాటు శాఖపరమైన క్రమ శిక్షణ చర్యలకు ఉపక్రమించాలని భావిస్తోంది.
- ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందన్న హుకుం జారీ చేసిన యంత్రాంగం రెవెన్యూ శాఖ స్థాయిల్లో టాస్క్ ఫోర్స్ టీమ్‌లను నియమిస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తోంది. అలాగే, గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ గోడలు, ఫెన్సింగ్ వంటి రక్షక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది.

ప్రభుత్వ సంరక్షణలో ఎంత భూమి ఉందో చెప్పని అధికారులు...

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ శాఖ... అందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.
- శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల్లో పేర్కొంది.

జిల్లాలో అసైన్డ్ భూములూ ఎక్కువే...

- జిల్లాలో 2004సంవత్సరం వరకు 116 రెవెన్యూ గ్రామాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని 17గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం హయాంలో రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. అదులో 30శాతం వరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

నాగారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులోని ఈస్ట్‌గాంధీనగర్, సాయిబాబాకాలనీ, ప్రశాంత్‌నగర్, సాయిమహిమకాలనీ, సాయికృప, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లో వీధి కుక్కలబెడద, కోతుల బెడద అధికంగా ఉందని, దీంతో కాలనీవాసులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివిధ కాలనీల అధ్యక్షుడు నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

హానికరమైన చెత్తను వేరుచేయాలి

కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి, నాయకులు

ఘట్‌కేసర్: తడి పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరుచేయాలని మూడో వార్డు కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేక్ ఇండియా స్వచ్ఛ గ్రీన్ జైన్‌లో భాగంగా ఐటీసీ డబ్ల్యూఓడబ్ల్యూ ఆధ్వర్యంలో 'నా చెత్త.. నా బాధ్యత' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలని, హానికరమైన చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం తడి, పొడి, హానికర చెత్తను వేరుచేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, వావ్ ప్రతినిధులు రాకేశ్, రామకృష్ణ, అనురాధ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్‌ముదిరాజ్, ముత్యాలుయాదవ్, రహీం పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్ కోసం నిధులు మంజూరు



పబ్లిక్ టాయిలెట్ నిర్మాణాల కోసం స్థలాలను పరిశీలిస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన మున్సిపల్ పరిధిలోని రాంపల్లి, నాగారం తదితర ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించారు. 12 చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ కె.చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.31 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాలి



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, అధికారులు, కౌన్సిలర్లు

కీసర:దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 1 నుంచి 18 వార్డుల్లో భూగర్భ మురుగు కాల్వల మరమ్మతులకు రూ.18 లక్షలు, బతుకమ్మ చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.7 లక్షలు, సీసీరోడ్డు వేసేందుకు మరో రూ.6 లక్షలు మొత్తం రూ.31 లక్షల మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించి, ఈమేరకు మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో తీర్మానించారని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని పరిశీలించిన అధికారులు



అవుషాపూర్ వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారి నవకాంత్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఉమ్మడి మండలం అవుషాపూర్, అంకుషాపూర్, పట్టణంలోని గట్టు మైసమ్మ వద్ద జాతీయ రహదారిని జాతీయ రహదారుల శాఖ డిప్యూటీ మేనేజర్ నవకాంత్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులను గమనించి అండర్ పాస్ రోడ్లు నిర్మించాలని, ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారని, ఇటీవల ఢిల్లీలో నేషనల్ హైవే అధికారులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు.

మైనింగ్ రంగంలో ప్రయోగాలు చేయాలి

ఘట్‌కేసర్: మైనింగ్ రంగ సమస్యల పరిష్కారం దిశగా ప్రయోగాలు చేయాలని ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేశ్‌కుమార్ గంజు, పూనే వింజిల్ టెక్నాలజీ ప్రతినిధి సుప్రియ మంగ్లేకర్ అన్నారు. మంగళవారం కాచివానిసింగారం నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్–23)ను అఖిల భారత సాంకేతిక విద్యామండలి అధ్యక్షుడు టీజీ సీతారామ్ వర్చువల్‌గా ప్రారంభించిన హ్యాకథాన్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హ్యాకథాన్ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా మాట్లాడుతూ 2017 నుంచి కేంద్ర మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ హార్డ్‌వేర్ ఎడిషన్‌కు తెలంగాణ నుంచి నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంపిక కావడం గొప్ప విషయం అన్నారు. కళాశాల చైర్ పర్సన్ కేతిరెడ్డి సంధ్యావళి, డైరెక్టర్ స్నేహ నల్లా, ప్రిన్సిపల్ ఎంఎస్‌వీ రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు



కీసర: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరుగుతుందని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా సప్త ద్వారాల ద్వారా ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

మంత్రి తుమ్మలను కలిసిన హరివర్ధన్‌రెడ్డి



మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నియమించడంతో ఆయనను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి కలిశారు. తుమ్మల నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గం, జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించారు.

కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్ పనులను ప్రారంభించాలి



మేడ్చల్: కండ్లకోయలో శంకుస్థాపన చేసిన కండ్లకోయ గేట్‌వే ఐటీ పార్క్ పనులను త్వరగా ప్రారంభించాలని రాష్ట ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును పార్క్ ప్రతినిధులు కోరారు. కొంపల్లి ఐటీ పార్క్ ఎంటర్ ప్రీనర్స్ అసోసియేషన్(కైటా) ప్రతినిధులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



హ్యాకథాన్‌ను పర్యవేక్షిస్తున్న కో ఆర్డినేటర్ డా.శృతి భార్గవ చౌబే

పోచారం: ప్రతిష్టాత్మంగా చేపట్టిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 గ్రాండ్ ఫినాలే ప్రోగ్రాం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. 36 గంటల పాటు కొనసాగే హ్యాకథాన్‌లో దేశం నలుమూలల నుంచి వచ్చిన 200 మంది విద్యార్థులతో పాటు 60 మంది మెంటర్స్ పాల్గొన్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగే హ్యాకథాన్ కార్యక్రమానికి శ్రీనిధి వేదికైంది. పలు రంగాల్లో ఎదురయ్యే సమస్యలకు ప్రపంచస్థాయి పరిష్కారాలను రూపొందించడానికి ఏర్పాటు చేసిన హ్యాకథాన్‌లో పాల్గొనే అవకాశం దక్కడమే తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పలువురు విద్యార్థులు ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా డా.శృతి భార్గవ చౌబే వ్యవహరిస్తున్నారు.

ఎమ్మార్‌సీఈలో హ్యాకథాన్ ప్రారంభం



హ్యాకథాన్‌లో ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీస్‌పై వర్క్‌షాప్, హ్యాకథాన్ మంగళవారం ప్రారంభమైంది. జేఎన్‌టీయూ జగిత్యాల ప్రొఫెసర్ విశ్వనాథ్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థుల్లోని ఆలోచనలకు పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు ఆవిష్కరించడానికి హ్యాకథాన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల విద్యార్థులు పలుమార్లు హ్యాకథాన్ పోటీల్లో విజయం సాధించారని, ప్రస్తుతం నాగపూర్‌లో జరుగుతున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో ఫైనల్‌లో ప్రవేశించారని, విజయం సాధిస్తారని ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. మూడు రోజుల పాటు సాగే పోటీల్లో 300 మంది విద్యార్థులు పాల్గొనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్నోవిస్టా హెచ్‌ఓడీ బ్రిట్టో, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీవీ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ బిల్లులు చెల్లించండి

కీసర మండల విద్యుత్ ఏఈ మురళీకృష్ణ

కీసర: వివిధ గ్రామాల్లోని రైతులు తమ వ్యవసాయ విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని కీసర మండల విద్యుత్ ఏఈ మురళీకృష్ణ కోరారు. కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 2,500 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఇప్పటివరకు సుమారు రూ.45 లక్షల మేర వ్యవసాయ విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ విద్యుత్ బిల్లులను వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఒక్క వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు రోజు రూ.1 చొప్పున నెలకు రూ.30 విద్యుత్ బిల్లు వస్తుందని, ఈమేరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతులు తమ విద్యుత్ బిల్లులను చెల్లించాలన్నారు. లేనిచో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్‌ను నిలిపివేస్తామన్నారు. అదేవిధంగా అక్రమంగా వ్యవసాయ విద్యుత్‌ను వినియోగిస్తున్న రైతులు తమ కనెక్షన్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలన్నారు.

వ్యవస్థాపకులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మేడ్చల్‌రూరల్: వ్యవస్థాపకులు విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలని మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్స్ డైరెక్టర్ షాలిని రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా కళాశాలలో మంగళవారం ఇ–సమ్మిట్ నిర్వహించారు. ఆమె పాల్గొని మాట్లాడుతూ వ్యవస్థాపక స్వరాలను ఒక్కచోటికి చేర్చి వారి స్టార్టప్ వాయిస్‌ల అనుభవాలతో అభివృద్ధి చెందుతున్న వ్యవస్థాపకుల సామర్థ్యాలను బలోపేతం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కారెన్స్‌గ్రో సీఈఓ మేఘనా, ఆడిట్‌వన్ కో ఫౌండర్ రాజశేఖర్ తమ ప్రసంగంలో వ్యాపారం చేసే మార్గాలు, డబ్బులు పెట్టుబడిగా పెట్టి విజయం సాధించే విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత మాట్లాడుతూ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వారి అభిప్రాయాలను ప్రదర్శించడానికి, ఇతరుల ఆలోచనలను తెలుసుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఇ– సమ్మిట్‌లో 25 మంది పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను పంచుకున్నారు.

కొల్తూర్ గ్రామంలో చోరీ

శామీర్‌పేట్: కొల్తూర్ గ్రామంలోని ఓ ఇంట్లో సోమవారం చోరీ జరిగిన ఘటన జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామంలో గుమ్మడి జహంగీర్‌బాబు, కలమ్మలు నివాసం ఉంటున్నారు. బంధువుల ఇంటి వెళ్లి సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసమై ఉండటాన్ని గమనించిన బాధితులు ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే జినోమ్ వ్యాలీ పోలీసులకు సమాచారం అందించారు. గ్రామంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తాం



కీసర మండల పరిషత్ కార్యాలయం వద్ద కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



జవహర్‌నగర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: మేడ్చల్ నియోజకవర్గంలోని పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కీసర మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 35 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణితాగౌడ్, ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్లు మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, వైస్ఎంపీపీ జె.సత్తిరెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ పథకంతో ప్రతి ఇంట్లో ఆనందం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు మంగళవారం జవహర్‌నగర్ తహసీల్దార్ మీటింగ్ హాలులో తహసీల్దార్ మతిన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మీ పథకంతో ప్రతి ఇంట్లో ఆనందం నెలకొందన్నారు. ఆర్ఐ లక్ష్మీ, కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, లావణ్యసతీష్‌గౌడ్, సతీష్‌కుమార్, శారదామనోధర్‌రెడ్డి, పల్లపు రవి, లక్ష్మీ, చిత్రసుబ్రహ్మణ్యం, శాంతికోటేష్‌గౌడ్, నిహారికగౌడ్, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీల నాయకులు తదితరులు పాల్గొనన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

శామీర్‌పేట్: శామీర్‌పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీలకు చెందిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులు మంగళవారం జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డిలు చెక్కులు పంపిణీ చేశారు. శామీర్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేసి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, ఎంపీడీఓ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

18 మంది లబ్ధిదారులకు..

ఘట్‌కేసర్: పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన ఘట్‌కేసర్ మండలం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన 18 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ అరుణారెడ్డి, సర్పంచులు కావేరి, శివశంకర్, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రవీందర్, మల్లేశ్, రవి, నాయకులు జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సకాలంలో అనుమతులు



సంబంధిత అధికారులతో సమావేశంలో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామికాభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించి టీఎస్– ఐపాస్, టీ ప్రైడ్ కింద అర్హులైన వారికి పరిశ్రమల ఏర్పాటుకు ఆలస్యం చేయకుండా అనుమతులు ఇవ్వాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీఎస్– ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎంతో అనుకూలత ఉందని, పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుంటారని వారికి అన్ని రకాల అర్హతలు ఉన్నట్లయితే త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. పరిశ్రమ ప్రోత్సాహక కమిటీ ద్వారా జిల్లాలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా జారీ చేయాల్సిన అనుమతుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, సత్వరమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. టీఎస్ ఐపాస్ కింద పరిశ్రమలకు కావాల్సిన వివిధ అనుమతుల మంజూరు పురోగతిపై సమీక్షించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ 14 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తకు రూ.38,72,528, పదిహేను మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.46,13,992, ఇద్దరు జనరల్ పారిశ్రామికవేత్తలకు రూ.3,54,359 పెట్టుబడి రాయితీ కింద మంజూరీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించటంతో పాటు ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ప్రజలకు సేవ చేయడంలోనే ఎంతో సంతోషం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ (డీఎం అండ్ హెచ్‌వో) అధికారి డాక్టర్ రఘునాథస్వామితో కలిసి వైద్యశాఖ పనితీరుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఆరోగ్య శాఖకు సంబంధించి పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ, పల్లె దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే విషయాలపై ఆయన పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో వైద్యం సరిగ్గా అందడంలేదనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, వైద్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.